# శివరంజని

(కథానిక)

అప్పుడే పొద్దుకుంకుతోంది. హాలులో ఒంటరిగా కుర్చీలో జేరబడి ప్రకాశం ఆ అరుణ కాంతులు ఆకులమీదా పువ్వులమీదా పడి ప్రతిఫలిస్తూ విరియబోస్తూన్న అందాలని పరికిస్తూ తన్మయత్వం చెందుతున్నాడు. సూర్యుడు దిక్చక్రంలోకి జారినకొద్దీ అరుణకాంతులు అత్యారుణాలౌతున్నాయి. క్రమంగా నీడలు పొడవై ఒక్కసారి కాంతిరేఖలు వర్ణం మారుతున్నాయి

సరిగ్గా ఆ సమయంలోనే మేడమీది కిటికీలు తెరుచుకున్నాయి. ప్రకాశం ప్రకృతి సౌందర్యాన్నవలోకిస్తూ ఒక్కసారి లేచి నిలువబడ్డాడు. నాలుగుసార్లు అటూ ఇటూ పచారుచేసి దూరంగా కొండలవైపు చూస్తూ నిలబడి, మళ్లా మామూలుగా కుర్చీలో కూర్చున్నాడు.

వీణకి శృతులు సరిచేసి, మేడమీద గదిలో పెట్టుకుని శివరంజని ఆలాపిస్తోంది సావిత్రి. ఒక్క శబ్దతరంగమైనా కర్ణపుటాలని దాటిపోకుండా వింటున్నాడు ప్రకాశం. అతని మనస్సుని ఆ రాగం నలిపివేస్తోంది; కూలా అతో పొముస్తోంది; అతను మనిషంతకంతకీ తేలిక అయిపోతున్నాడు. మెట్టు మెట్టుకీ సావిత్రి వేళ్ళల్లో అతను లీనమైపోతున్నాడు.

ఏదో లోకం... ఎక్కడా భూమి లేదే! అన్నీ గొయ్యిల్లాంటి చెట్లు... నల్లటి నీళ్లు... ప్రకాశం ఆ లోకపుటాకాశంలో అయోమయంగా ఎగిరిపోతున్నాడు. ఎక్కడ దిగడం?

అతని ప్రయాణ వేగం హెచ్చింది. మరేదో లోకం. అంతా మసక వెలుతురు. కింద నేమిటుంది? ఆ నదులు- ఆ అడవాళ్లెందుకు అలాగ రోదిస్తున్నారు? ఆపాములా రోదనకేనా అలాగ నాట్యం చేస్తున్నాయి? ఈ శబ్దాలేమిటి? అవి అత్యంత మార్దవాలా? లేక విపరీత కర్కశాలా? ఎక్కడనించి?

ఇదేమిటీ లోకం? తళతళ మెరుస్తూ ఈ కొండలు వెన్నెలలో హిమమయాలా? వెండితో పూతపూశారా? ఆ మహోన్నత ప్రవాహా లవెక్కడనించి?

ప్రకాశం ఇంకా తేలిపోతూనే ఉన్నాడా లోకంలో. ఒక్కసారి లోకాలన్నీ అదృశ్యమయాయి. మసకచీకట్లని అర్ధచంద్రుడు చిందరవందర చేస్తున్నాడు. వీణమీద రాగాలాపనని సావిత్రి పూర్తిచేస్తున్నది,

ద...రీగరీ...సారిసా...

అతను తృళ్ళిపడ్డాడు. ఇంకా శివరంజనిలోని రాగతరంగ సంపుటాలతని తలనుంచి విడిపడలేదు.

"సాయంత్రం నించీ ఇక్కడే ఉన్నారా?"

స్వర్ణ మార్దవంగా అడిగింది. అతనికి పూర్తిగా తెలివి వచ్చింది ముఖంమీద స్వర్ణ చేతిలోని దీపపుకాంతులు పడడంతో. ఆమె ముఖాన్ని జ్యోత్స్న ప్రకాశవంతం చేస్తోంది. అతను ఆలోచిస్తున్నాడు ఏమిటి చెప్పడం జవాబు అని.

ఒక్కసారిగా స్వర్ణ అతని గుండెలనీ, కళ్లనీ చేతితో తడుముతూ "ఈ కన్నీళ్ళేమిటండీ?" అన్నది బెదురుతూ.

ఆమెగొంతుకి తృళ్లిపడి, ప్రకాశం గుండెలు తడుముకున్నాడు. చెక్కిళ్లు చూసుకున్నాడు. అన్నీ ఆర్ద్రాలే.

"చెమట పట్టికుంటుంది" అన్నాడు జవాబుగా. కాని, ఆ జవాబులోని అర్థవిహీనత్వం ఆ ఇద్దరికీ తెలుస్తూనే ఉంది.

కొంచెంసేపు ఇద్దరూ మాటలాడలేదు. స్వర్ణ కళ్ళతో చుట్టూ చూస్తూంది అతని దుఃఖకారణాన్ని పరిశీలిస్తూన్నట్లు. అతను వెర్రిగా లేచి నిలబడ్డాడు.

"మీరేదో దాస్తున్నారు కాదూ?"

ప్రభావతీదేవి

స్వర్ణ చాలా బాధగా అడిగింది. ప్రకాశం ఆమెను చెయ్యిపట్టుకుని లేవదీస్తూ, "ఏమీ లేదు స్వర్ణా. లోపలికి పోదాం పద. మంచు పడుతోంది" అన్నాడు. స్వర్ణ లేచి నిలువబడి రెండో చేతిలో దీపం తీస్తూ లోపలికి దారి తీసింది. అతను జరిగిన గంటలో జరిగిన విశేషాలని జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు. పరధ్యానంగా తన గదిలోకి నడిచి మంచంమీద కూర్చున్నాడు.

స్వర్ణ గదిలో దీపం హెచ్చించి, కిటికీ తెరలు దింపుతూంది. "ఈ రోజు తెరలు దించకు. వెన్నెలని చూడాలని ఉంది" అన్నాడు ప్రకాశం. స్వర్ణ మళ్ళా తెరలని ఎత్తికట్టేసి, "స్నానం చేస్తారా?" అంది.

"కొంచెంసేపు పోయాక..."

స్వర్ణ వెళ్ళిపోయింది. ఇరవై నిమిషాల తరవాత ఆమె వచ్చేసరికి అతను హార్మోనియం ముందుకూర్చుని నిమిషానికొక మెట్టు చొప్పున మ్రోగిస్తున్నాడు.

ద...రిగరి...సారిసా...

రెండు...నాలుగు...ఆరుసార్లు.

"ఇవాళ మీరు మామూలుగా లేరు. ఎందుకంత దిగులుగా కనిపిస్తున్నారు? సాయంత్రం నేను గుడికి వెళ్ళిపోయానని కోపంవచ్చిందా?" స్వర్ణ మంచంమీద కూర్చుని అడిగింది అతను లేచి నిలబడి "ఏమీలేదు స్వర్ణా. ఎందుకో కొంచెం బద్ధకంగా ఉంది. వెళ్ళి స్నానం చెయ్యనా?"

అర్థంకానట్లు ఒక్కసారి చూసి స్వర్ణ తువ్వాలు పట్టుకుని స్నానాల గదిలోకి నడిచింది. అతనామె వెనకాలే నడిచాడు.

* * *

భోజనంచేసి వచ్చి ప్రకాశం తన గదిలో కూర్చున్నాడు. పదిగంటల గాఢనిద్ర తరవాత లేచినట్లు ఉంది అతని స్థితి.

పళ్లెంలో తమలపాకులూ, చెక్కపొడీ వేసి తీసుకువచ్చి టేబిల్ మీద పెడుతూ, సావిత్రి ఒకసారి అతని ముఖంలోకి చూసి, తిరిగి వెళ్ళిపోతోంది. ప్రకాశం సావిత్రిలో ఏదో కొత్తదనాన్ని చూస్తున్నాడు; ఆమెకళ్ళల్లో అతనికేదో అసామాన్యమైన కాంతి కనిపిస్తోంది.

ఎందుకో తెలియకుండా "సావిత్రీ" అని పిలిచాడు. సావిత్రి ఒకసారి ఆగి, వెనుదిరిగి వచ్చింది. "ఎందుకండీ?" అంది గుమ్మానానుకుని నిలబడి.

ఎందుకు? ప్రకాశం ఒక్కసారి తెలివి తెచ్చుకుని "అక్క ఏంచేస్తూంది నువ్వు తెచ్చావు?" అన్నాడు.

"భోంచేస్తోంది... నేను తెస్తే తప్పా?"

బలవంతాన నవ్వాడు ప్రకాశం. "తప్పని కాదు లే. నీకెందుకంత శ్రమ అని."

సావిత్రి చిరునవ్వుతో నెమ్మదిగా వెళ్ళిపోయింది. సాయంకాలం సంగీత తరంగాలు మళ్ళా ఒక్కసారి అతన్ని చుట్టుముట్టాయి. అవి విన్నతానంతగా ఆ ప్రభావానికి లొంగిపోతే వాటిని సృష్టించిన సావిత్రి ఎంత తేలికగా ఉంది?

వెన్నెల గదిలో కిటికీలోంచి పడుతోంది. ఆకులు సావిత్రి ఈనెలు తీసే తెచ్చింది. నెమ్మదిగా వాటిని వేసుకుంటూ ప్రకాశం ఆలోచనలో పడ్డాడు.

ఎందుకు తనసామె రాగాలాపన అంత బాధించాలి? ఆ కొన్ని క్షణాలూ తానెందుకంత తన్మయత్వం చెందాలి? తనకి తెలియకుండా తనకెందుకు కన్నీళ్ళు రావాలి? తన హృదయంలో బరువైన నల్లమేఘాలలాగ ఈ బాధ యెందుకు కలగాలి?

ఇన్నాళ్ళ నించీ సావిత్రి తానుండగా యెందుకు పాడలేదు? ప్రకాశం ఈ సంవత్సరమంతటిలోనూ మామగారింటికి వచ్చినప్పుడల్లా ఆమెని చూస్తూనే ఉన్నాడు. కాని, ఇందాకటి ఆమెలోని ముసుగుతీసిన సౌందర్యమూ, గొంతుకలోని మాధుర్యమూ యెందుకతనికి కనపడలేదు?

ఏవేవో ఆలోచనలలో అతను మునిగిపోయాడు. క్రమంగా అతనికి నిద్రపట్టింది. వీణాగానం మళ్ళా అతని మెదడులో తల యెత్తింది. అతని కళ్ళనించి నీరు కారుతోంది.

అతనా పరిస్థితిలో ఎంతసేపు ఉన్నాడో కాని అతను లేచేసరికి అతని తలగడ అంతా తడిసిఉంది. వెన్నెల పువ్వులల్లే విరిసి కాస్తోంది. అస్పష్టంగా అతనికి శివరంజని రాగంలో కళ్ళ

ఇంకా వినపడుతూనే ఉన్నాయి. చాలా సేపు మంచంమీద ఆలోచిస్తూ కూర్చున్నాడు. హఠాత్తుగా అతనికి తట్టింది టైమెంత అయి ఉంటుందని.

చుట్టూ చూశాడు. ఎదురుగా మంచంమీద స్వర్ణ అమాయికంగా నిద్రపోతోంది. గడియారం ఒంటిగంటన్నర చెప్తోంది. అతను లేచాడు. నిశ్శబ్దంగా తలుపు తెరచుకుని డాబా మీదికి వచ్చాడు. కుర్చీలో కూర్చున్నాడు. చల్లగా ఉంది హాయిగా.

తన పరిస్థితికి అతనికి ఆశ్చర్యమూ కోపమూ వచ్చాయి. ఏమహాశక్తి తనని ఆ రాగానికి దాసుడిగా చేసింది? ఏ పూర్వగాథ తనని ఆ రాగానికి మంత్ర బద్ధుడిగా చేసింది?

ఎన్నో ఆలోచనలు అతని తలలోకి వస్తున్నాయి. ఎక్కడో రెండు గంటలు కొట్టారు. మూడు కొట్టారు. స్వర్ణ అతన్ని లేపి లోపలికి తీసికొని వెళ్ళి మంచంమీద పడుకో పెట్టింది.

అతను ఉదయం లేచేసరికి అతన్ని తలనొప్పి విపరీతంగా బాధిస్తూంది.

* * *

స్వర్ణా సావిత్రీ వెంకట్రామయ్యగారి అమ్మాయిలు. సావిత్రి పదిహేడేళ్ళది, స్వర్ణ రెండేళ్లు పెద్దది. నిరుడు పెళ్ళయింది. ఆయన కింకే సంతతిలేదు. స్వర్ణ ఎనిమిదోతరగతితో చదువుకి చుక్క పెట్టింది. సావిత్రి స్కూల్ ఫైనల్ ప్యాసయింది. వెంకట్రామయ్య ఆస్తిపరుడనే చెప్పాలి. పట్టంలోఉన్న ఇల్లంతా గుణపురంలో సముద్రపు ఒడ్డున కట్టించుకున్నాడు. చిన్న జమీందారు హోదాలో బ్రతుకుతున్నాడు. భార్య రెండేళ్లయిపోయింది.

ప్రకాశం ఆధునిక భావాలున్న చక్కటి యువకుడు. కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్ గా పని చేస్తున్నాడు. అన్న ఒక్కడు తప్ప నా అనే వాళ్ళతని కెవ్వరూ లేరు. మామగారి కోరికతో సెలవులు మూడునెలలూ ఇక్కడ గడపడానికి వచ్చాడు. సంగీతమంటే అతను ప్రాణం ఇస్తాడు.

అతని తొలిరోజు మామగారి ఇంటిలో లాగ గడిచింది.

• • •

అలస్యంగా తలనొప్పి తగ్గాక లేచి ప్రకాశం స్వర్ణ సహాయంతో ముఖం కడుక్కొని కిటికీలోంచి చూస్తూ కూర్చున్నాడు. సావిత్రి కాఫీ తీసుకొచ్చి కప్పులో పోసి టేబిల్ మీద పెడుతూ, "తలనొప్పి తగ్గిందా?" అని అడిగింది.

ఆ కంఠధ్వని అతనికి అమృతం పోస్తోంది. "తగ్గింది" అన్నాడు.

అతను కాఫీతాగి, కప్పు టేబిల్ మీద ఉంచాడు. కప్పు తీసుకుంటూ సావిత్రి, "రాత్రి ఆ సమయంలో మంచులో యెందుకు కూర్చున్నారు? వంటికి మంచిది కాదేః?" అన్నది.

ప్రకాశం త్రుళ్ళిపడ్డాడు. సమాధానం ఇచ్చేలోగా సావిత్రి వెళ్ళిపోయింది. స్వర్ణ కొన్ని పుస్తకాలు పట్టుకుని లోపలికి వచ్చింది.

"ఎలా ఉందండీ? తగ్గిందా?" అంది స్వర్ణ.

అతను పరధ్యానంగా తల ఊచాడు.

"కాఫీ ఇచ్చిందా సావిత్రి?"

"ఇచ్చింది"

"ఇంకేమైనా తెమ్మనేదా?"

"వద్దు లే."

స్వర్ణ గదంతా సవరించి పుస్తకాలు టేబిల్ మీద ఏర్పరిచి లోపలికి వెళ్ళబోతోంటే ప్రకాశం పిలిచాడు.

"సావిత్రి ఇప్పుడు పాడమంటే పాడుతుందా?" అని అడుగుదామనుకున్నాడు. కాని స్వర్ణ ఏమనుకుంటుందోనని, "సావిత్రి సంగీతం నేర్చుకుందా?" అన్నాడు.

స్వర్ణ నవ్వుతూ, "దానికి నేర్పేవాళ్లెవరు? స్వంతంగానే నేర్చుకుంది ఇదిగో హార్మోనియం వీణా, రెండూ కొనింది. ఏ సాయంత్రమో దానికి బుద్ధి పుడితే వాయిస్తుందేదో ఒకటి. లేకపోతే శృతివేసుకుని పాడుకుంటుంది. అదేమిటి పాడుతుందో దానికే తెలియాలి!"

"అస్తమానం పాడుతుందా?"

"అబ్బే! ఏవారానికో ఒకసారో రెండుసారులో పాడుతుంది. నిన్న విన్నారుగా. అన్నట్టు మీ కప్పటికి బాగులేదు కాబోలు, ఈసారి వినదురుగాని లెండి."

"సరే లే. ఇంకా ఉంటావుగా."

స్వర్ణ పనులు చూసుకోడానికి వెళ్ళిపోయింది. టేబిల్ మీదనించి ఒక పుస్తకం తీసుకుని ప్రకాశం చదవడం మొదలుపెట్టాడు. కథాగమనంలోపడి చాలాసేపు అతను ఇతర విషయాలని మరచిపోగలిగాడు.

ఆరోజు సాయంత్రందాకా అతనికి మళ్ళీ సావిత్రి కనపడలేదు. సినిమాకి వెడితే బాగుండు ననుకుంటూంటే స్వర్ణ వచ్చింది టీ పట్టుకుని.

"ఈ ఇంట్లో నువ్వు కాఫీ, టీల విషయంలో మాత్రం నన్ను మరిచిపోవనుకుంటాను!" అన్నాడు నవ్వుతూ టీ తీసుకుని ప్రకాశం.

స్వర్ణ "నాన్నగారికి ఒంట్లో బాగుండ లేదుగా. అక్కడ ఉంటున్నాను. ఓసారి వచ్చి చూచిపొండి. మెట్లన్నీ ఎక్కి రాలేరాయన" అన్నది.

ప్రకాశం సరే అని, "సినిమాకి పోదామా? ఏదో మంచి పిక్చరు ఉన్నట్లుంది?" అన్నాడు.

స్వర్ణ నిర్వికారంగా "ఎలాగ వచ్చేది? నాన్నని చూడాలి. కావలిస్తే మీరు వెళ్ళండి. సావిత్రి చాలారోజులనించి వెళ్ళనే లేదట."

"బాగానే ఉంది. అదేమైనా చంటిదనుకున్నావా?"

"అక్కర్లేదు. చదువుకుంది."

ఇద్దరూ నవ్వుకున్నారు. సాయంత్రం సావిత్రీ, ప్రకాశమూ థియేటరుకి బయలుదేరారు. సావిత్రి తెల్లటి చీర కట్టుకుని నల్లటి జాకెట్ వేసుకుంది. ప్రకాశం పంచె, లాల్చీ వేసుకున్నాడు.

థియేటర్ చేరేదాకా ఎవ్వరూ మాటలాడ లేదు. బాక్సు టిక్కెట్లు కొనుక్కుని ఇద్దరూ పోయారు. కూర్చుంటూ, ప్రకాశం "నువ్వు రావేమోననుకున్నాను" అన్నాడు పిరికిగా.

సావిత్రి నవ్వుతూ "ఏం?" అంది.

అతను జవాబివ్వలేదు. అధమం అప్పుడు అతనాలోచించే పరిస్థితిలోనైనా లేడు. తన ప్రక్కన కూర్చున్న ఆ లావణ్యమయి అతని హృదయాన్ని గాలిలో కలిపివేస్తూంది. అతను ఇతర ప్రపంచాలలోనే విహరిస్తున్నాడు.

చిత్రం ప్రారంభించారు. నాయిక, నాయకుడు. సావిత్రి అప్పుడప్పుడు నవ్వుతోంది. ఆమె రాసుకున్న దిల్బహారు సెంటూ, ముఖాన ఉన్న ఇతర పరిమళాలూ మిళితాలై ప్రకాశాన్ని చుట్టుముడుతున్నై. ఒకసారి అతను ఓరకంటితో ఆమెముఖంలోకి చూశాడు. ఆమె పరధ్యానంగా తెరవైపు చూస్తున్నది. ఆమె మనోహరత్వం అతన్ని తన్మయుణ్ణి చేసింది. ఒక్కసారిగా తన రెండు చేతులలోకీ ఆమెని తీసుకుని ఆమె తియ్యటి పెదవులకి తన పెదవులని కలిపాడు.

సావిత్రి చిరునవ్వు నవ్వింది. ఇద్దరూ థియేటర్‌నించి బైటికి నడిచారు.

* * *

మర్నాడు సాయంత్రం సావిత్రి ఆనంద భైరవి శ్రావ్యంగా ఆలాపిస్తూంది. ప్రకాశం తన గదిలోంచే వింటున్నాడు. అతని హృదయం తేలికపడుతూంది. అరుణ కిరణాలూ, దూరాన కొండలూ, తోటలో పువ్వులూ అతనిని తన్మయుణ్ణి చేస్తున్నవి. ఆనంద భైరవి, సావిత్రి గాత్రంలోని మార్దవమూ, ఆమె ముఖంలోని సౌందర్యమూ అతన్ని తన్మయుణ్ణి చేస్తున్నాయి.

పాట ఆపగానే అతను ఆమెఉన్న గదిలోకి వెళ్ళాడు. సావిత్రి మంచం మీద కూర్చునుంది. కిటికీ తలుపులన్నీ తెరచి, గది ఇంకా కాంతివంతం చేసింది.

ప్రకాశం కుర్చీలో కూర్చున్నాడు. తన ఆనందాన్ని ఏమాటలలో ఏభాషలో చెప్పాలో అతనికి తెలియలేదు.

"చాలా బాగా పాడావు సావిత్రీ!"

"అలాగా?"

"నీపాట వింటూంటే ఎంత ఆనందంగా ఉందంటావు? ఈగానం అంతా స్వంతంగా నేర్చుకున్నావా?"

"ఔను."

"నిన్న నువ్వు శివరంజని పాడుతూంటే ఎంత బాధ పడ్డానంటావు? ఇంకెప్పుడూ ఆ రాగం మాత్రం పాడకు."

సావిత్రి నవ్వింది. "అలాగా! నాకేం తెలీదే? సరే" అంది.

వెంకట్రామయ్య క్రమంగా కోలుకుంటున్నాడు. కొంచెం ఇంటిలో మసులుతున్నాడు.

సావిత్రి ప్రకాశానికి చాలాదగ్గర అయిపోయింది. స్వర్ణ ఒకనాడు సావిత్రీ ప్రకాశమూ మాటలాడుకుంటూంటే వచ్చి చిన్న నవ్వుతూ, "చాలా పరిచయం అయ్యారే! ఇది యెవరితోనూ మాటలే ఆడేదికాదు!" అంది. ప్రకాశం నవ్వాడు సావిత్రి ముఖం చూసి. సావిత్రీ నవ్వింది.

"గుణపురం వెళ్దామంటున్నారు" అంది స్వర్ణ.

ప్రకాశం మళ్ళా సావిత్రివైపు చూశాడు. "అక్కడా బాగానే ఉంటుందిగా? సముద్రమూ అదీ చాలా హాయిగా ఉంటుంది. మంచిరోజు చూసి బయలుదేరుదాము" అంది మళ్ళా స్వర్ణ.

"సరే" అన్నాడు ప్రకాశం. సావిత్రి వాళ్ళని వదిలిపెట్టి వెళ్ళిపోయింది. ఈ మధ్య ప్రకాశం స్వర్ణకి ఒంటరిగా దొరకడమే లేదు. ఆమె ఎదుట ఒంటరిగా నిలబడడంవల్ల అతనికి ఏదో నేరంచేసిన భావన వస్తోంది.

"అక్కడికి వెళ్ళడం ఇష్టంలేదా?" అంది స్వర్ణ.

"లేకేం? మీ నాన్నగారికి సరదా యెలాగైతే అలా చేద్దాం."

"మరి మీరు అర్థాంగీకారం సూచిస్తారేం?"

"నా కంగీకారమే. తప్పకక్కడకి వెళ్దాం."

స్వర్ణ కిటికీలోంచి నిలబడి దూరదృశ్యం చూస్తోంది. కొంచెంసేపు నిశ్శబ్దంగానే నిలబడి అతనివైపు తిరిగింది. ఆమె కళ్లు నీళ్ళలో నిండి ఉన్నాయి. అతను త్రుళ్ళిపడాడు.

"ఏమిటది స్వర్ణా?"

"ఏమీలేదు. సావిత్రి విషయం ఆలోచిస్తున్నాను."

అతని గుండెలు త్రుళ్ళిపడాయి. స్వర్ణ ఈ మహాగ్ని శిఖలని హృదయంలో ఓర్మితో భరిస్తోందా? ఎంత నీచంగా ప్రవర్తించాడు తాను! ఈ ఒక్కసారీ ఆమె క్షమిస్తే?

"నాన్న ఇంకెంతకాలం ఉంటారు? దాని పెళ్ళి ఆయనకి సమస్యగానే ఉంది. ఆ పెళ్ళి కూడా అయిపోతే ఆయన గుండెలు కుదుటపడతాయి."

అతను కొంత కుదుటపడ్డాడు. గండం గడిచింది.

* * *

అతని గుండెమీద తల నాన్చుకుని సావిత్రి గోముగా అంది. "పెళ్లిలో మిమ్మల్ని ఎంతగా మోశానంటారు! నాకు ముందు మీ సంగతి తెలిస్తే మిమ్మల్ని అక్కకి దక్కనిచ్చేదాన్నా?"

వాళ్ళిద్దరూ సముద్రపు వడ్డున కూర్చున్నారు. తరంగాలు వడ్డుకి కొట్టుకుంటున్నాయి.

"ఏమైనా పాట పాడు సావిత్రీ. నాకు భయంగాఉంది స్వర్ణని తల్చుకుంటే ద్రోహం చేస్తున్నానే అని. అది పోయేలాగ."

"మళ్ళా వెనక్కి పోతున్నారు. జీవించడానికి కొద్దిరోజులే వ్యవధి. ఆనందంగా గడపక అవవసరంగా ఈ బాధలు పడకండి."

"నీకు తెలీదు సావిత్రీ. నువ్వింత అందంగా ఉండడం భగవంతుడి తప్పు. నా గుండెలు."

సావిత్రి అతనినోరు తన చేతితో మూసింది. ఆ పరిసరాలని ఆనందభైరవి రాగంతో నింపేసింది.

"కొసరి కొసరి నాతో సరసము లాడకు."

* * *

అతనింటికి వచ్చేసరికి స్వర్ణ వాకిట్లో కూర్చునుంది. వెంకట్రామయ్యగారు "లోపలికి రావమ్మా, ఇంక వాళ్ళే వస్తారు" అంటున్నారు. ఒక్కగెంతులో సావిత్రి వచ్చి- "రానేవచ్చాం నాన్నా" అన్నది. ప్రకాశం గుండె జల్లుమన్నది, ఈ లావణ్యరాశి గత క్షణాల చరిత్రని తన గుండెలలో దాచుకొన్న నేర్పుకి.

అందరూ భోజనం చేసేరు. తరువాత స్వర్ణ గదిలోకి వస్తూ, "రేపు ఇంటికి ప్రయాణం" అంది.

"అంత హటాత్తుగా?"

"ఔను. నా వంట్లో బాగులేదు. ఈ వేళల్లా జ్వరం వచ్చినట్టుంది. డాక్టరు నడిగితే సముద్రపుగాలి వద్దన్నాడు."

"నాతో చెప్పలేదేం స్వర్ణా?"

"చెప్తున్నాగా? అనవసరంగా మిమ్మల్ని బాధించడం ఎందుకని ముందు చెప్పలేదు. రేపు పోదామా?"

"తప్పకుండాను."

కొద్దిసేపటిలో అతను పక్కకి చూసేసరికి స్వర్ణ గాఢంగా నిద్రపోతోంది. ఆమె నుదుటి మీద చెయ్యి వేశాడు. ఒక్కసారి ఆమె త్రుళ్లిపడింది; నుదురు నిప్పుల్లాగ కాలుతూంది.

అతని మనస్సు తీవ్రఖాల పనిచెయ్యడం మొదలుపెట్టింది. నిజంగా స్వర్ణ తన పంకిలాన్ని గుర్తించే ఉంటుంది. ఆ మానసిక వేదనే ఆమె నస్వస్థంగా చేసి ఉంటుంది. తానెంత ద్రోహం తలపెట్టాడు? అవివాహిత- అమాయకురాలి శీలాన్ని ఖలిగొనడం ఎంత అమానుషం?

స్వర్ణదగ్గిర జరిగినది అంగీకరించి క్షమాపణ అడిగితే? కాని, స్వర్ణ అస్వస్థత కేవలము భౌతిక కారణ ఫలితం అయి ఉంటే అనవసరంగా తాను అన్యాయం చేసుకుంటాడే. అయినా తొలిమల్లెలలాగా సావిత్రి...

రాత్రి గడుస్తోంది, అతను ఆలోచనలమధ్య ఊగులాడుతున్నాడు. ఎటూ నిర్ధరించుకోలేకుండా ఉన్నాడు.

తెల్లవారింది. స్వర్ణ మంచం వదలలేదు. కంగారుగా ప్రకాశం ఆమెని తట్టిలేపాడు. వళ్లంతా సలసల కాగుతోంది.

"ఎలాగ ఉంది స్వర్ణా?"

"తలనొప్పి ...తగ్గిందిలెండి. ప్రయాణానికి సిద్ధం చెయ్యమనండి. ఎందుకనో చాలా భయంగా ఉంది."

"ఏమీ లేదు స్వర్ణా. ప్రయాణానికి తొందర ఏమిటి? నీజ్వరం కొంత నయమయ్యాక బయలుదేరుదాం రెండురోజుల్లో. ఈ ముప్పై మైళ్ళూ ఇప్పుడెలాగ వెళ్తాము?"

"వద్దండీ- ఇంటికి వెళ్తేగాని నాకిది తగ్గదు. ఇంకేమీ అనకండి."

అపూట వాళ్లు ప్రయాణమయ్యారు. సాయంత్రానికి ఇంటిలో దిగారు. వెంటనే డాక్టరుకి కబురు పంపారు.

నాలుగురోజులైనా జ్వరం మళ్లుముఖం పట్టలేదు. సావిత్రీ ప్రకాశమూ, వెంకట్రామయ్యగారూ ఆమెనుంచాన్ని వదిలిపెట్టడం లేదు.

"టైఫాయిడ్" అన్నాడు డాక్టరు. వెంకట్రామయ్యగారు బావురుమన్నారు.

రోజులో కొద్ది నిమిషాలు మాత్రం స్వర్ణ మాటలాడుతోంది. రుగ్మత క్రమంగా హెచ్చిపోతూంది. ఇరవై రోజులు గడిచాయి.

ఒక రోజున స్వర్ణ ప్రకాశాన్ని చూస్తూ "ఇంక బతకనేమో" అంది.

"అలాగ ఏమీ అనకు స్వర్ణా. తప్పకుండా నయమౌతుం దంటున్నాడు. ఇవాళ కొంచెం బాగున్నావు కూడాను."

స్వర్ణ ఇంకేమీ మాటాడలేదు. ఆ రాత్రి ఆమె కళ్లు మూసింది.

* * *

చితినుంచి పొగ గాలిలో కలిసిపోయి స్వర్ణ శరీరాన్ని ఆత్మతో పాటు ప్రకృతిలో ఐక్యం చేసింది. మాటలాడకుండా ప్రకాశం పనులన్నీ ముగించి ఇంటికి తిరిగివచ్చాడు. సాయంత్రం అవుతోంది. తోటలో గడ్డిమీద పడుకున్నాడు. చుట్టూ జరుగుతూన్నదంతా అతనికి సగం నిజమైన ఒక కలలాగ కనిపిస్తూంది. ఏడుద్దామనుకున్నాడు కాని ఏడవడానికికూడా తా నశక్తుడనని తెలుసుకున్నాడు.

స్వర్ణ ఎందుకు చచ్చిపోయిందో అతనికి అర్థంకాలేదు. నిజంగా చచ్చిపోయిందా?

ఎక్కడో శివరంజని రాగం వినిపిస్తూంది. అతని కళ్లంట నీరు రావడంలేదు. కాని అంతరంగంలో అతనూ ఏడుస్తున్నాడు. ఆ రాగం మరింత దగ్గరైంది. ఈ లోకం వదలినట్లూ, పాతాళంలోకి త్రొక్కబడినట్లూ అతను భావించుకొంటున్నాడు. అతని మనసు ముళ్లకి తగులుకుని ...

"లెండి బావగారూ."

సావిత్రి అతని చేతులని యెత్తి లేపుతోంది. అతను లేచాడు. ఇంకా శబ్దతరంగాలు అతన్ని పూర్తిగా వెంటాడుతూనే ఉన్నాయి. లోపలికి లాక్కుని వెళ్లి మంచంమీద పడుకోబెట్టింది సావిత్రి.

"ఘోరం చేశాము సావిత్రీ!"

ప్రకాశం తల తిరుగుతోంది. చుట్టూ ఏమిటేమిటో కనిపిస్తున్నాయి. ఎవరెవరో ఆడవాళ్లు యేడుస్తున్నారు. వాళ్ళల్లో స్వర్ణా.

ఏవో కొండలు, హిమాలయాలా? వెండిపూతా? అంతా చల్లదనం ఒక్కసారి నల్లగా

అయిపోయింది.

ప్రకాశం పలవరిస్తున్నాడు. సావిత్రి ఏడుస్తోంది.

* * *

కర్మకాండ ముగించుకుని ప్రకాశం ఇంటికి తిరిగివచ్చాడు. ఆ ఇంటిలో స్వర్ణ మసలుతూండగా తాళాలు వేశాడు. ఇప్పుడు...

మంచంమీద పడుకున్నాడు. ఆ బూజు గోడల్లో స్వర్ణ నీడలు కనిపిస్తున్నాయి. ఒక్కసారిగా ఆనాటి సాయంకాలం సంగీతం మళ్ళా గాలిలో నిండింది. అవే, కళలు అదే కాలం.

తలుపు తీసుకుని అన్న వచ్చాడు. వెంటనే వదినా వచ్చింది.

"ప్రకాశం!"

అన్న నెమ్మదిగా పిలిచాడు. ప్రకాశం వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. వదిన తలుపులన్నీ తీసింది. అతను ప్రకాశాన్ని బలవంతాన లేవతీశాడు. "ఏమిటీ యేడుపు, ప్రకాశం? కొంచెం సముదాయించుకోవద్దూ? పోయిన వాళ్లు తిరిగి వస్తారా?"

"నా స్వర్ణ పోయిందన్నయ్యా ఇంక నే నేడవక యేంచేసేది?"

"అందరూ ఏదో ఒక రోజున పోవలసిన వాళ్ళే కదూ ప్రకాశం? నాన్న, అమ్మ, అంతా ఏమయ్యారు? కొంచెం జ్ఞానమూ ఓరిమీ ఇప్పుడే అవసరం బాబూ! లే, నాతో రా."

నాలుగు నెల లయేసరికి ప్రకాశం కొంచెం సర్దుకున్నాడు. వెంకట్రామయ్య గారొక్కసారి చూసి పొమ్మని కబురు పెట్టారు.

"ఆ ఇంటి కింక వెళ్ల లేను" అన్నాడు ప్రకాశం.

"కాదు బాబూ. ఆయనకి కన్నకూతురు కాదూ? ఒక్కసారి చూసిరా" అన్నారు అన్నా వదినాను. తప్పక బయలుదేరాడు.

కన్నీళ్లతో ఆహ్వానించారు వెంకట్రామయ్యగారు. "ఇన్నాళ్లకి వచ్చారా?" అంది రుద్ధకంఠంతో సావిత్రి

ఆరోజెలాగో గడిచింది కన్నీళ్లమధ్య దుఃఖతరంగాలమీద.

రాత్రి మాట్లాడుతూ వెంకట్రామయ్యగారు "సావిత్రిని చేసుకోనాయనా, ఇంక నేనే సంబంధం వెతుకుతాను? భగవంతుడు డిలాటి ఆఘాతం కలుగజేశాడు" అన్నారు.

కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉన్నాక ప్రకాశం దృఢంగా, "అలాగ జరగడానికి వీల్లేదు మామగారూ" అన్నాడు.

మామగారు తెల్లబోయారు.

"కారణం అడగకండి మామగారూ. కాని సావిత్రిని నేను వివాహం చేసుకోలేను" అన్నాడు.

నిరాశ చేసుకుని ఆయన వెళ్లిపోయాడు. గదిలో పడుకున్నాడు ప్రకాశం. ఆరోజు థియేటరులో జరిగిన సంఘటన దగ్గరనించీ ప్రతి సంఘటనా అతనికి ప్రత్యక్షమవుతూంది.

అర్ధరాత్రి అయి ఉంటుంది. వెన్నెల మల్లెలు పరచినట్లు కాస్తోంది. ప్రకాశం డాబామీదకి వచ్చి కూర్చున్నాడు. కొంచెంసేపు అయాక అడుగుల చప్పుడైంది. వెనుదిరిగాడు. సావిత్రి తన గుండెల మీదపడి ఏడుస్తూంది. కళ్లన్నీ వాచిపోయి, మాటలకి దుఃఖం అడ్డువస్తూంటే వెక్కి వెక్కి ఏడుస్తూంది.

ప్రకాశం మాట్లాడ లేదు. ఆమెని దూరంగా ఉంచడానికి చాలా ప్రయత్నించేడు. చొక్కా అంతా తడిసిపోయింది. ఆమె వళ్ళంతా వణకుతోంది.

"అలాగ ఎందుకండీ చెప్పారు నాన్నతో?" కష్టంగా అడిగింది సావిత్రి.

"ఎలాగ?"

కాస్త నసగక తప్పలేదతనికి.

"నన్ను పెళ్ళి చేసుకోనని?"

అతను కొంచెం ఆగాడు.

"నిన్ను పెళ్ళాడడం నాకిష్టం లేక."

సావిత్రి నిశ్చేష్టురాలైంది. ఆమె చేతుల లోని బలం తగ్గి అతను విడివడ్డాడు.

"నిజమే చెప్తున్నారా?"

"అసత్యానికి సమయం కాదు సావిత్రీ. నిజంగానే చెప్తున్నాను. నిన్ను నేను పెళ్లాడదలచుకోలేదు."

సావిత్రి కళ్లు తుడుచుకుంది.

"ఔను సావిత్రీ మనం ఘోరమైన పాపం చేశాము కొంచెం ఆలస్యమైనా, పశ్చాత్తాపం పడాలిసినది మన విధి. స్వర్ణ మాటలేకుండా

ఈ విచారాన్ని గుండెలలో దాచుకుని చచ్చిపోయింది. ఇంకా ఆమెకి కృతఘ్నుడిగా ఉంటావా? క్షమించు సావిత్రీ"

కన్నీళ్లతో మామగారి దగ్గర సెలవు తీసుకున్నాడు. ప్రకాశం సావిత్రి గదిలోనికి వెళ్ళాడు. ఇంకా ఆమె లేవలేదు. బరువైన ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలామె గుండెలని చదివి అతనికి పాఠం చెప్తున్నాయి.

ప్రకాశం వెనుదిరిగాడు. అతని హృదయాన్ని నిదురిస్తోన్న సావిత్రి ఒక్కసారి లాగినట్లయింది.

నిదురిస్తూన్న వీణ ఒక్కసారి జాగ్రదవస్థకి వచ్చినట్టు శివరంజని రాగతరంగాలు అతను వినసాగాడు.

తొందరగా వచ్చి అతను జట్కాలో కూర్చుని "మహా వేగంగా పోనీ" అన్నాడు.

అతని మనస్సుని అర్థం చేసుకున్నట్లు గుర్రం గాలిలో పరుగుతీసింది.

ప్రకాశం చేతుల్లో తల దాచుకున్నాడు. గుర్రం ఆకాశంలో దౌడు తీస్తోంది.

ఏదో లోకం. ఎక్కడా భూమి లేదే? అన్నీ కోయిల్లాంటి చెట్లు. నల్లటి నీళ్లు. ఆ లోకపు టాకాశంలో ప్రకాశం ఎగిరిపోతున్నాడు.

అతన్ని వెంటాడుతున్నాయ్ శివరంజని రాగతరంగాలు. ఎక్కడో ఆ రాగానికి తాళం పడుతోంది.

రాగం, తాళం, దుస్వప్నం.

ప్రకాశం చెమట పోసిన నుదిటిని గట్టిగా పట్టుకున్నాడు. "ఏమైనా సరే, నీకు అన్యాయం చెయ్యను స్వర్ణా!" అతను పదేపదే అనుకుంటున్నాడు.

"ఈ రాగం వినను. వినను. నాకు వినపడదు." చెవులు గట్టిగా మూసుకున్నాడు.

శివరంజని రాగతరంగాలు వినిపిస్తూనే ఉన్నాయ్. ఆవేదనగా అశాంతిలో, అవిరళంగా అతను బ్రతికి ఉన్నన్నాళ్లు, వాయు తరంగాలకి సంచలనం ఉన్నన్నాళ్ళు ఆ రాగం అతనికి వినిపిస్తూనే ఉంటుంది. ఆ తరంగాలు అతనెక్కడ ఉన్నా వినిపిస్తూనే ఉంటాయి.


ఇప్పుడే వెలువడింది

## "కీలు బొమ్మలు"

(నవల)

రచయిత : జి. వి. కృష్ణరావు

½ క్రౌను. 235 పేజీలు

వెల : రూ. **2-8-0**

దొరికే చోట్లు :

## నలందా ప్రెస్,
## తెనాలి